
- తొలి విడత ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- మంత్రి ఇలాకాలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం
- అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన అధికారులు
- గ్రామాల్లో వేడెక్కనున్న రాజకీయాలు
- అధికార పార్టీ నుంచే నామినేషన్లు అధికం
- ఈనెల 11న 5 మండలాల్లో పోలింగ్

ఇక ప్రచార హోరు



పెద్దపల్లి/మంథని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రాజ కీయ వేడి రాజుకుంది. జిల్లాలో తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. పల్లెల్లో ఇక ప్రచార పర్వం మారు మోగనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం పెద్దపల్లి జిల్లా పరిధిలో నాలుగు గ్రామ పంచాయతీల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 53 వార్డు స్థానాల్లో కూడా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మంథని మండలంలో మూడు, రామగిరి మండలంలో ఒక పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంథని మండలం ఖైదుపల్లి పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించగా, పంతంగి లక్ష్మన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కొత్తగా ఏర్పడ్డ తోట గోపయ్యపల్లి పంచాయతీ సర్పంచ్ బీసీ జనరల్‌కు కేటాయించగా సర్పం చ్‌గా దొబ్బల రమేష్, ఆరు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి జనరల్ మహిళకు కేటాయించగా బెల్లంకొండ శ్రీదేవి ఏకగ్రీవంగా గెలుపొందారు. రామగిరి మండలం చందనాపూర్ పంచాయతీ సర్పంచ్ బీసీ మహిళకు రిజర్వు చేయడంతో కొండా మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడిగా ఉన్న పంతంగి లక్ష్మణ్ మంగళవారం రాత్రి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఖైదుపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చర్చనీయాంశంగా మారింది. ముత్తారం మం డలంలో 20 వార్డులు, రామగిరి మండలంలో 24 వార్డులు, కమాన్‌పూర్ మండలంలో 12 వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంథని నియో జకవర్గంలో నాలుగు పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ద్వితీయ శ్రేణి నాయకులు మంతనాలు జరిపారు.

బరిలో ఉన్న ప్రత్యర్థి పై ఎన్నికల్లో పై చేయి సాధించడానికి రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగేందుకు ప్రయ త్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే కొందరు సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల అవసరాల కోసం ముందస్తుగానే భారీగా డబ్బులు, మద్యాన్ని సమకూర్చుకున్నట్లు సమాచారం. తొలి విడత పోలింగ్ జరిగే 5 మండలాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచే సర్పంచ్ అభ్యర్థుల పోటీ అధికంగా ఉంది. 9 ఏళ్ళ తర్వాత కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, దాదాపు 12 ఏళ్ళ తర్వాత గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు రావడంతో, రిజర్వేషన్లు తమకు అనుకూలంగా ఉండటంతో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే అధికంగా నామినేషన్లు దాఖలు చేశారు. వీరిని సమన్వయం చేయటానికి

(మిగతా 8వ పేజీలో)

తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థులు

మండలం	మొత్తం పంచాయతీలు	సర్పంచ్ నామినేషన్లు	ఉపసంహరణ	బరిలో అభ్యర్థులు	ఏకగ్రీవం
కాల్వశ్రీరాంపూర్	24	172	96	76	--
కమాన్‌పూర్	09	93	48	45	--
రామగిరి	16	160	94	65	01
ముత్తారం	15	89	31	58	--
మంథని	35	270	137	130	03

నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలి



పెద్దకల్వలలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రామ్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినే షన్‌ల ప్రక్రియ సజావుగా జరగాలని పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దకల్వల, అప్ప న్నపేట గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను అధికారు లతో కలిసి సందర్శించారు. డీసీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కు మార్, రూరల్ ఎస్ఐ మల్లేష్, ఉన్నారు.

అంగవైకల్యం శరీరానికే మనస్సుకు కాదు



దివ్యాంగుల క్రీడలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అంగవైక్యలం శరీరానికే కానీ, మనసుకు కాదని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. బుధవా రం జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వ హించిన అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. దివ్యాం గులు మనోధైర్యంతో జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అందిస్తుందని వివరించారు. అన్ని రంగాల్లో రిజర్వేషన్లు, వసతులను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. న్యాయపరమైన సహాయం కోసం జిల్లా లీగల్ సెల్ అథారిటీని ఉపయోగించుకొని న్యాయం పొందాల న్నారు. సదరం క్యాంపును దివ్యాంగులు అవకాశం మేరకు వినియో గించుకోవాలన్నారు. చీఫ్ డిఫెన్స్ లీగల్ లీడ్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ భాను, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, డీఎంహెచ్ఓ వాణిశ్రీ, అడిషనల్ డీఆర్‌డీఏ శ్రీనివాస్, సూపరింటెండెంట్ రాయ్య, ఎఫ్ఆర్ఓ స్వర్ణలతతోపాటు అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌ను వినియోగించుకోవాలి



భవిత సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఈవో

పెద్దపల్లి కల్చరల్, డిసెం బరు 3(ఆంధ్రజ్యోతి): భవిత్ సెంటర్‌ను దివ్యాంగ విద్యార్థు లు వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నా రు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సం దర్భంగా జడ్పీ ఉన్నత పాఠ శాల ఆవరణలో నిర్మించిన భవిత కేంద్రాన్ని ప్రారంభిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ భవిత సెంటర్‌లో వారంలో రెండుసార్లు విద్యార్థులకు ఫిజియోథెరపి చేస్తా రని, భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ సూచించారు. భవిత సెంటర్‌లో చదివే దివ్యాంగ విద్యార్థులకు యేటా ప్రభుత్వం రూ.5 వేల స్కాలర్ షిప్ అందిస్తున్నట్లు, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, జిల్లా విద్యాధికారి శారద, ఎంఈఓ సురేందర్ కుమార్, ఎస్ఓ కవిత, ఐఆర్‌పీలు సంధ్యారాణి, రజని, అధికారులు పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం



అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల నినాదాలు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాకారమైం దని తెలంగాణ ఉద్యమ ఫోరం జిల్లా అధ్య క్షుడు గుండేటి ఐలయ్య అన్నారు. జిల్లా కేం ద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలం గాణ మలిదశ ఉద్యమ తొలివీరుడు శ్రీకాం తాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంత చారి మరణం యావత్ దేశాన్ని ఆలోచింప జేసిందన్నారు. తెలంగాణ పోరాటం చరి త్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తిం చి, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల కుటుంబాలకు, ప్రాణాలు అర్పించిన వారి కుటుంబా లకు ఆర్థిక సహాయం అం దించాలని కోరారు. సబ్బెడ చంద్రకళ, గోగుల రాజిరెడ్డి, మంద భాస్కర్ యాదవ్, తాడూరి శ్రీమాన్, దామ సదయ్య, సుధాకర్, బోర్ల ధనంజయ్, తీట్ల మల్లేశం, ములుగూరి నర్సయ్య, చంటి నర్సమ్మ, ఖతిజ, గడ్డం లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



ఖనిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవుళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం గోదావరి ఖని చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేయడానికి యత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకుని చిత్రపటాన్ని స్వాధీనం చేసుకున్నా రు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలను చేయ డాన్ని హిందూ సమాజం తీవ్రంగా ఖండి స్తుందన్నారు. హిందువులందరూ ఐక్యతగా ఉండి భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. సంజీవ్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మాదరబోయిన రాకేష్, మడి కొండ శ్రీనివాస్, పవన్, ఆకాష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): దేవుళ్ళను అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తా వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీ సులు అడ్డుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతి రేక భావజాలాన్ని రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజా నికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాం డ్ చేశారు. చిలవేరు ఓదెలు, భూషణవేన శ్రీనివాస్ గౌడ్, అక్కెపల్లి క్రాంతికుమార్, పర్శ సమయ్య, మౌటం నర్సింగం, వెల్లంపల్లి శ్రీనివాస్ రావు, పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ సెక్యూరిటీ గార్డ్‌లకు అందని వేతనాలు

కోల్‌సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్ షిప్‌లోని సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. 35మంది సెక్యూరిటీ సిబ్బందికి ఆగస్టు నుంచి కాంట్రాక్టు ఏజెన్సీ వేతనాలు చెల్లించడం లేదు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం సెక్యూరిటీ గార్డ్‌లకు సంబంధించి గైర్హాజర్‌పై జరిమానాలు ఎక్కువగా విధిస్తుం డడంతో సదరు సెక్యూరిటీ ఏజెన్సీ వేతనాలకు సంబంధించి బిల్లు పెట్టన్నట్టు తెలుస్తున్నది. సదరు ఏజెన్సీ, హెచ్ఆర్ విభాగం స్పందించక పోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వారు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్ఎఫ్‌సీఎల్ హెచ్ విభాగం కూడా సరైన బాధ్యత తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. కాంట్రాక్టర్‌కు, యాజమాన్యానికి మధ్య వివాదంలో కార్మికులు నలిగి పోతున్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని, పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు చెల్లించలేక పోతున్నామని సెక్యూరిటీ సిబ్బంది పేర్కొంటున్నారు.

అభ్యంతరాల పరిష్కారం తర్వాతే భూసేకరణ



అప్పన్నపేటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరాల పరి ష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం అప్పన్నపేట గ్రామంలో పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం చేపట్టిన ఎంజాయింట్ సర్వే ప్రక్రియను కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం బైపాస్ రోడ్డు మంజూరు చేసిందని, బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసర మైన భూ సేకరణ నిమిత్తం ఎంజాయిమెంట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవ సరం లేదని, మెరుగైన పరిహారంతో రైతులను ఒప్పించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్అండ్‌బి భావ్‌సింగ్, ఇన్‌చార్జి తహసీల్దార్ విజేందర్, సర్వేయర్‌లు, అధికారులు, పాల్గొన్నారు.

ఆస్తుల రక్షణలో సీఐఎస్ఎఫ్ కృషి అమోఘం



ప్రసంగిస్తున్న సీఐఎస్ఎఫ్ఐ ఐజీ శరవణన్

జ్యోతినగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రా మిక ఆస్తుల పరిరక్షణలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఎంతో కృషి చేస్తోందని సీఐ ఎస్ఎఫ్ ఐజీ శరవణన్ అన్నారు. బుధవారం ఎన్‌టీ పీసీ సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌లో జరిగిన సైనిక్ సమ్మేళనంలో ప్రసంగిం చారు. పరిశ్ర మల ఆస్తుల రక్షణతోపాటు ఆయా సంస్థల ఉద్యోగులకు భద్రత కల్పి స్తుందన్నారు. పరిశ్రమలు, విమానాశ్రయాల రక్షణ బాధ్య తలను సీఐ ఎస్ఎఫ్ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. రామ గుండం ఎన్టీపీసీలో జవానులు సమర్థవంతంగా పని చేయడం ఆనం దం కలిగిస్తోందని, భవి ష్యత్‌లో ఇలాగే విధులు నిర్వహించాలని సూచించారు. జవానులు ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. సైబర్ నేరాలు పెరిగి పోయాయని, వాటిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐఎస్ ఎఫ్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని ఐజి శరవణన్ అన్నారు. ఎన్టీపీసీ యూనిట్ కమాండెంట్ అరవింద్ కుమార్, అధికారులు, జవానులు పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలి



బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ

పాలకుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులపై నమ్మ కం కలిగే విధంగా వ్యవహరించాలని పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సం దర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ ఫిర్యాదుల సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి పంచా యతీ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి సూచన లు చేశారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా చెరువుల అభివృద్ధి



చెరువులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ముత్తారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా చెరువుల అభివృద్ధి చర్యలు తీసుకొంటున్నామని అదనపు కలెక్టర్ దాసరి వేణు తెలిపారు. మండలంలోని పారుపల్లి చెరు వును అదనపు కలెక్టర్ డి.వేణు, ఇరిగేషన్ ఈఈ బలరాం, ఫారెస్ట్ జిల్లా అధికారి శివయ్యలు సందర్శించారు. జిల్లాలో సుమారు 247 చెరువులను గుర్తించామని, వాటిని కాపాడుతూ, అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. చెరువు శిఖం భూములను కాపాడేందుకు, చెరువుకు చేపట్టాల్సిన మరమ్మతు, చేపల పెంపకం, నీటి వసతుల రూపకల్పన, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డీఈ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ జగదీష్, ఇరిగేషన్ ఏఈ సమీయోద్దీన్‌లతోపాటు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు రమేష్, మల్లేష్ తదితరులున్నారు.

ఫోర్‌లేన్ బైపాస్ రోడ్డు పనులకు శ్రీకారం



ప్రొక్లెయిన్‌తో ట్రెంచ్ కట్ పనులు

- హద్దుల నిర్ధారణ కోసం ట్రెంచ్ పనులు ప్రారంభం
- రూ. 162 కోట్లతో 9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం
- రూ. 125 కోట్లతో గోదావరినది పై నిర్మించే బ్రిడ్జికి అనుసంధానం

మంథని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంథ ని బైపాస్ రోడ్డు నిర్మాణానికి అధికారులు మం గళవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ పరిధి లోని కూచిరాజ్‌పల్లి శివారులో రోడ్డు నిర్మాణ హద్దు నిర్ధారణకు అధికారులు ప్రొక్లెయిన్‌తో ట్రెంచ్ పనులు ప్రారంభించారు. దీంతో ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న మంథని పట్టణ బై పాస్ రోడ్డు నిర్మాణం పనులు ఎట్టకేలకు మొద లయ్యాయి. మంత్రి శ్రీధర్‌బాబు కృషి మేరకు రూ. 125 కోట్లతో మంథని పట్టణ శివారులోని గోదావరినది పై నిర్మించే హైలెవల్ బ్రిడ్జికి అనుసంధానంగా మరో 162 కోట్ల వ్యయం అం చనాతో 9 కిలోమీటర్ల దూరంలో 4 లైన్లతో మంథని పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి శివారులోని రైస్ మిల్లు సమీపం నుంచి మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి దగ్గరి నుంచి బైపాస్ రోడ్డు ప్రారంభమై గోదా వరినదిలో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జినికి అనుసంధానం చేయనున్నారు. గోదావరినదిలో నిర్మించే బ్రిడ్జి ద్వారా మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, భీమారం, జైపూర్ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. మంథని పట్టణ శివారులో నిర్మించే తొలి బ్రిడ్జి, బైపాస్ రోడ్డుతో వాహనాల రవాణా, ప్రజల రాక పోకల రద్దీ పెరిగే అవకాశం ఉంది. అయితే బైపాస్ రోడ్డు భూసేకరణ అంశంలో రైతులకు న్యాయ మైన నష్టపరిహారం చెల్లించే విషయంలో అధికారులు, రైతుల మధ్య ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే బ్లాక్‌లిస్టులో పెడతాం

కోల్‌సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల టెండర్ పొందిన కాంట్రాక్టర్లు పను లు సకాలంలో చేయడంలో నిర్లక్ష్యం చేస్తే బ్లాక్‌లిస్టులో పెడతామని అదనపు కలెక్టర్ అరుణశ్రీ హెచ్చరించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పనుల పురోగతిపై కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెండర్ పొందిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఏమైన ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఈఈ రామన్, కాంట్రాక్టర్లు కుర్మ శ్రీనివాస్, సదానందం, ప్రతాప్‌రెడ్డి, తిరుపతి, కోడూరి రమేష్ గంగరాజు, శశికాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ట్రాక్టను ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో చోటుచేసుకుంది. పత్తిపాకకు చెందిన నవనందుల రాజేష్, అరవెండి కిష్టయ్య, మంగారపు సాయికుమార్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం బైక్‌పై గంగ స్నానానికి గోదావరికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పత్తిపాక గ్రామ డాంబర్ ప్లాంట్ సమీపంలో ఆగిఉన్న ట్రాక్టర్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బండి నడుపుతున్న నవనందుల రాజేష్(36) అక్కడికక్కడే మృతిచెందగా కిష్టయ్య, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108సిబ్బంది గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ ప్రవీణ్ సందర్శించి వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన బోయినిపల్లి వెంకటరమణారావు(56) బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గతనెల 30న వెంకటరమణారావు బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడ్డాడని, తలకు తీవ్రగాయాలవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. వెంకటరమణారావు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలైనవ్యక్తి మృతిచెందిన సంఘటన ధర్మపురి మండలంలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కునసపల్లి మురళి(48) ఈ నెల 1న సుతారీ మీటింగ్ నిమిత్తం రెబ్బనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో పొలాల నుంచి వస్తున్న ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో మురళి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. వెంటనే మురళిని హుటాహుటిన 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మురళి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఓదెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంసానిపల్లికి చెందిన కందుల రాజు(35) అనేవ్యక్తి పురుగులమందు తాగి బుధవారం మృతిచెందాడు. మతిస్థిమితం సక్రమంగా లేక మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి



హుజూరాబాద్‌లో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద విశ్వకర్మ మన్నయసంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భిక్షపతి, రఘు, సత్యనారాయణ, శ్రీనివాస్, వీరాచారి, సదానందం, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు



డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

తిమ్మాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి ఓ లారీడ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా లారీని నడుపుకుంటూ వెళ్తుండగా ఎల్ఎండీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి లారీని సీజ్ చేశారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ లారీ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ రాజీవ్ రహదారిపై వెలుతుండగా గమనించిన బ్లూకోల్ట్ సిబ్బంది లారీని వెంబడించారు. సుభాష్‌నగర్ వద్ద లారీని పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా అతిగా మద్యం సేవించినట్లు వచ్చింది. అతివేగంతో పాటు అతిగా మద్యం సేవించి లారీ నడుపుతున్న లారీ డ్రైవర్ మెదక్ జిల్లా నర్సింగ్ గ్రామానికి చెందిన కబూజి వేణును అదుపులోని తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీని సీజ్ చేసి ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ హెచ్చరించారు

బీసీలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో బీసీ సామాజిక బిడ్డపై అగ్రవర్ణాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ జేఏసీ, ప్రజాస్వామిక బీసీ ఉద్యమవేదిక నాయకులు అన్నారు. బుధవారం వారు వేర్వేరుగా హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 78ఏళ్లు గడుస్తున్న అగ్రవర్ణాల ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయన్నారు. నల్గొండ జిల్లాలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన నాగలక్ష్మి తమ స్వగ్రామంలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగా, ఆమెభర్త యాదగిరిని కిడ్నాప్‌చేసి మూత్రం తాగించిన సందీప్ రెడ్డిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో వెంకన్న, శ్రీనివాస్, ప్రభాకర్, సమ్మయ్య, కేశవులు, ఓదెలు, రామ్, సారన్న, మధుకర్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్, క్రాంతి, రవీందర్, సదానందం, ప్రభాకర్, ముత్యంరాజు, ఖలీద్ హుస్సేన్, రాజేశ్వరరావు, చారి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కేంద్రం కానుక

● పీఎం సమృద్ధి యోజన ద్వారా భరోసా
● వేములవాడలో 3,260 మందికి రుణాలు



వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోడ్లపక్కన తోపుడు బండ్లు, షెడ్లు వేసుకుని బతుకు బండితో జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారు లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం కానుకగా మారింది. తోపుడు బండ్లపై ఆధారపడి కాలం గడుపుతున్న వ్యాపారులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తే విడుతల వారీగా రూ.10వేల నుంచి 50 వేల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకంలో వ్యాపారం చేసుకోవడానికి ఎలాంటి పర్మినెంట్ భవన సముదాయం లేని, కొట్టు లేని, షటర్స్ లేని, రెంట్ భవనం లేని వారు, వీధుల్లో పండ్లు, కూరగాయాలు, తోపుడు బండ్లను వినియోగించి వివిధ రకాల వస్తువులను విక్రయించేవారు, మటన్, చేపలును విక్రయించే వారు అర్హులు. వేములవాడ మున్సిపాలిటీలో కోనాయపల్లి, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, తిప్పాపూర్ గ్రామాలు విలీనం కావడంతో 28 వార్డులుగా రూపాంతరం చెందింది. ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న పట్టణం కావడంతో పట్టణంలో చిరు, వీధి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో జీవిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో ఆర్పీ, సీఎల్ఆర్పీ, టీఎంసీలతో పట్టణ, సెమి అర్బన్ ప్రాంతాలలో చురుకైన వీధి వ్యాపారులు ఉన్న ప్రాంతాలను ముందుగా గ్రీన్, అంబర్, రెడ్ జోన్లుగా వర్గీకరించారు. గ్రీన్ జోన్ (వ్యాపారానికి అనుకులంగా) 3,133 మందిని, అంబర్ జోన్ (కాలనుగుణంగా వ్యాపారం చేసే వారు) 127 మందిని, రెడ్ జోన్‌లో ఎవరూ లేకపోవడంతో మొత్తంగా 3,260 మంది వ్యాపారులను గుర్తించారు.

● లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు

వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 3,260 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను అందించారు. అధికారులు సర్వే నిర్వహించి గుర్తించిన అనంతరం వ్యాపారులు ప్రస్తుతం తమ కొట్టు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం, జిరాక్స్‌లతో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలి. సంబంధిత ధ్రువపత్రాలను సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేసి ఐడీ కార్డులను వ్యాపారులకు అందిస్తారు. మొదటి విడతలో రూ. 10 వేలు బ్యాంకు మంజూరు చేస్తుంది. సంవత్సరం లోపు లోన్ డబ్బులు చెల్లిస్తే రెండవ విడుత రూ. 20 వేలు, మూడవ విడుత రూ. 50 వేలు బ్యాంకు వారు మంజూరు చేస్తున్నారు. ఇప్పటి వరకు మొదటి విడుతలో 2,453 మంది వ్యాపారులు రూ. 10 వేల రుణం తీసుకోగా, రెండవ విడుతలో 1,689 మంది రూ. 20 వేలు, 367 మంది రూ.50 వేల రుణాన్ని తీసుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ
- అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ



చిరు వ్యాపారులకు చేయుత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా పట్టణంలో వ్యాపారులను గుర్తించి ఐడీ కార్డులను అందజేశాం. బ్యాంకు నిబంధనలకు లోబడి రుణాలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే రూ. 50 వేల వరకు లోన్ తీసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ పట్టణంలో అర్హులైన చిరు, వీధి వ్యాపారులు ఉంటే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రవాణాశాఖ ఆధ్వర్యంలో..
వాహనాల తనిఖీ


పట్టుకున్న వాహనాలతో ఏఎమ్‌వీఐ

ఇల్లంతకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏఎమ్‌వీఐ రజనీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తనిఖీల లో సరైన ధ్రువపత్రాలు లేని 13వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు చెల్లించాలని సూచించారు. కొంత మంది వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టర్లను రవాణాకు వాడుతున్నారని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టుబడితే భారీగా జరిమానాలు పడుతాయని, వాహనాల నంబర్ ప్లేటు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్ల దొంగ అరెస్ట్

● 38 సిలిండర్లు స్వాధీనం

జగిత్యాల టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని పలు ఇళ్లలో సిలిండర్లు అపహరించుకువెళ్ళిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన షేక్‌సమీర్ అనే వ్యక్తి పట్టణంలోని ఓ సిలిండర్ గోదాంలో పనిచేస్తూ ఇళ్లకు గ్యాస్ సిలెండర్లను సప్లై చేస్తుండేవాడు. గోదాంలో పని మానేసిన తర్వాత సిలెండర్ల దొంగతనానికి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. గోదాంలో పని చేస్తున్న సమయంలో ఎవరి ఇంటి వద్ద రక్షణ లేకుండా సిలెండర్లు ఉంటాయో గమనించి పట్టణంలోని పలువురి ఇళ్లనుంచి 38సిలిండర్లను అపహరించుకొని వెళ్లాడు. సిలిండర్లు అపహరణకు గురైన పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ


పట్టుబడిన సిలిండర్లతో పోలీసులు

కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ ఎస్ఐలు ఎ.కుమారస్వామి,సిహెచ్ రవికిరణ్, ఎం. సుప్రియ, కానిస్టేబుల్ జీవన్ పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ఆయుష్య హోమం


ఆయుష్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి అనుబంధ దేవాలయం అయిన యమ ధర్మరాజు ఆలయంలో ఆయుష్యహోమం నిర్వహించారు. యమ ధర్మరాజు వారికి పురుష సూక్తం, శ్రీలక్ష్మీసూక్తం, మన్యసూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేకపూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, సంతోష్ కుమార్, సిబ్బందిఅర్చకులు అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని..
మోసం చేసిన యువకుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో నిందితుడు నగునూర్‌కు చెందిన బత్తిని శ్రావణ్‌కుమార్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన యువతి(19) తన మేనత్తతో ప్రతిమ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆ సందర్భంలో ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న కరీంనగర్‌రూరల్ మండలం నగునూరుకు చెందిన బత్తిని శ్రావణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని యువతిని నమ్మిస్తూ వచ్చాడు. ప్రేమ విషయం యువతి తన తల్లిదండ్రులకు చెప్పడంతో ఆమెను ఇంటి నుంచి పొమ్మన్నారు. అప్పటినుంచి శ్రావణ్‌కుమార్ ఫోన్‌స్విచ్ ఆఫ్ చేసుకోవడం, ఆమెను కలువకపోవడంతో నవంబరు 21న నగునూరులోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం శ్రావణ్ తల్లిదండ్రులతో చెప్పింది. వారు ఆ యువతిని దూషించి వెనక్కి పంపించారు. ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసిన శ్రావణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి కరీంనగర్‌రూరల్ పోలీసులకు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ కుమార్ తన మిత్రులను ఆ యువతి వద్దకు పంపించి తన సోదరి వివాహం అనంతరం రెండేళ్లకు వివాహం చేసుకుంటానని, అప్పటివరకు ఖర్చులు తానే భరిస్తానని బోదాసు దేవేందర్, దావు రవితేజ సమక్షంలో ఒప్పుకొని పేపర్‌పై రాసిచ్చాడు. ఆ మరుసటిరోజు నుంచి శ్రావణ్‌కుమార్ మళ్లీ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని యువతిని పట్టించుకోవడం లేదు. దీంతో శ్రావణ్‌కుమార్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయంచేయాలని రూరల్‌పోలీసులను ఆశ్రయించింది. యువతిని వైద్యపరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించామని సీఐ తెలిపారు.

ఎట్టకేలకు మినీ స్టేడియం పనులకు మోక్షం

● గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిచిన పనులు ● ఇటీవల రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం


మినీస్టేడియం గ్రౌండ్‌లో కంకర తేలిన ట్రాక్


నిర్మాణంలో ఉన్న భవన సముదాయాలు

వేములవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన మినీస్టేడియం పనులు పదకొండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. తిప్పాపూర్ గ్రామ శివారులో 2014 సంవత్సరంలో రూ.2.10కోట్ల నిధులతో మినీస్టేడియం నిర్మాణ పనులు చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు. నిధుల విడుదలలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు.

క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత మంత్రితో మాట్లాడి ఇటీవల రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పనులు పుంజుకున్నాయి.

ప్రస్తుతం మినీ స్టేడియం పనులను త్వరగా పూర్తి చేసేందుకు సోషల్ వెల్ఫేర్‌శాఖ అధికారులకు అప్పగించారు. దీంతో వచ్చే మార్చి వరకు పనులను పూర్తిచేసేందుకు కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

చివరి దశలో పనులు..

వేములవాడ ప్రాంత ప్రజల కోసం నిర్మించే మినీస్టేడియం పనులు ఎట్ట కేలకు చివరిదశకు వచ్చాయి. మినీస్టేడియంలో ఇప్పటివరకు డ్రెస్సింగ్ రూములు, కార్యాలయం భవనం, విశ్రాంతి భవనం, క్రీడా సామగ్రి భద్రపరిచే గదులు నిర్మాణ పనులు పూర్తిచేశారు. కిటికీలు, ప్రికాస్ట్ గోడలు, తలుపులతో పాటుగా ఇండోర్ స్టేడియం పైకప్పు పూర్తి చేశారు. ఆర్చిగేటు పనులు కొంతఆలస్యంగా కొనసాగుతున్నాయి. స్టేడియంలోని ట్రాక్‌పై కంకర తేలింది. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇతర పనులు వచ్చే మార్చిలోపు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ..

● 18 తులాల బంగారం, 111 తులాల వెండి, 1.55 లక్షల నగదు అపహరణ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రగతి నగర్‌లోని విజేత మనోహర హెవెన్స్ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి 2గంటల సమయంలో ముగ్గురు దొంగలు ముసుగులు, గ్లౌజ్‌లు ధరించి ప్లాట్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేశారు. అపార్ట్‌మెంట్‌లోని కేశెట్టి సందీప్‌కుమార్ దగ్గరి బంధువు మరణించడంతో గతనెల 6వ తేదీన ప్లాట్‌కు తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఉదయం అపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేయడంతో ఇంటికి వచ్చేసరికి తన ప్లాట్ తాళం పగులగొట్టి ఉంది. బీరువా, పూజగదిలో భద్రపరిచిన 10తులాల బంగారం, 111తులాల వెండి, లక్షా55వేల రూపాయలు నగదు కని పించలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లోని మరోప్లాట్‌లో నివాసం ఉంటున్న మూల కిష్టయ్య శనివారం తాళంవేసి గట్టెపల్లికి వెళ్లాడు. ఆయన భార్య 2నెలల కిందట మరణించింది దొంగలు ప్లాట్ తాళాలు పగులగొట్టి బెడ్‌రూంల్లోని సామగ్రి, దుస్తులను చిందరవందర చేశారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఏడాది కిందట ఈ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న ఇంటితాళాలు పగులగొట్టిన దొంగలు బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఆ కేసులో ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదని బాధితుడు రఘునందన్‌రావు వాపోయాడు.


తలుపునకు బిగించిన గడియను కట్ చేసిన దొంగలు

● ఉదయం 2గంటల ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వెనుకవైపు నుంచి ప్రహరీ దూకిన ముగ్గురు దొంగలు మొదట వాచ్‌మెన్ ఇంటి తలుపునకు గడియపెట్టారు. అనంతరం అపార్ట్‌మెంట్‌లోని తాళం వేసిన ప్లాట్‌ల వద్దకు వెళ్లి ఎదుట, పక్కన ప్లాట్‌ల తలుపులకు బయట నుంచి గడియపెట్టారు.

ఆయాప్లాట్‌ల తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. దాదాపు 3గంటల వరకు ముగ్గురుదొంగలు అపార్ట్‌మెంట్‌లోనే గడిపారు. ఎవరూ బయటకు రాకపోవడంతో వారిపని కానిచ్చారు. వాచ్‌మెన్ కూతురు 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా బయటవైపున గడియపెట్టిన విషయం అర్థమైంది. వెంటనే అపార్ట్‌మెంట్ వారిని వాచ్‌మెన్ అప్రమత్తం చేశాడు. అలికిడి వినడంతో దొంగలు అక్కడినుంచి పరారీ అయ్యారు. దొంగలు కొంతదూరంలో పార్క్ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలలో దొంగతనం మొత్తం రికార్డు అయ్యింది. సంఘటన స్థలాన్ని టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఎస్సై అరుణ్ పరిశీలించారు. క్లూస్‌టీం రెండు ప్లాట్‌లలో ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవిపందుల బీభత్సం

కోనరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో అడవిపందులు మంగళవారం రాత్రి బీభత్సాన్ని సృష్టించాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యం మీద కప్పిన కవ ర్లను చించివేశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో ప్రతిరోజు రాత్రిపూట ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాపాడుకోవడానికి వ్యక్తులను నియమించాలని కోరుతున్నారు. అధికారులు కాపలా ఎవరిని పెట్టకపోవడంతో అడవి పందులతో నష్టపోతున్నామని తెలిపారు.

బీరు బాటిళ్లు దాచిన ఘటనపై విచారణ

● ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో ఈనెల 2న యువకులు తరలిస్తున్న బీరు బాటిళ్లను ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వాధీనపర్చుకుని 4బీరు బాటిళ్లను దాచుకున్న ఘటనపై ఆ శాఖ సూపరిండెంట్ శ్రీనివాస్‌రావు బుధవారం విచారణచేపట్టారు. కానిస్టేబుళ్లు వ్యవహరించిన తీరుపై ఆరా తీశారు. బీరు బాటిళ్లను దాచుకున్నట్లు నిర్ధారణ కావడంతో కానిస్టేబుళ్లు రాజు, కిశోర్, మల్లేశంను కరీంనగర్ నోడల్ కార్యాలయానికి సరెండర్ చేశారని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్తు తీగ చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామశివారు శ్మశానవాటికలో ఉన్న బోరు మోటారు విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించుకుపోయారని స్థానికులు తెలిపారు. కరెంటు తీగ విలువ సుమారు రూ.7వేలు ఉంటుందని పేర్కొన్నారు.

రూ.7250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 53మంది రైతులు 338 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయస్థానం



పతకాలు సాధించిన విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మహిళా టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా మహిళాజట్టు తృతీయస్థానం సాధించింది. హైదరాబాద్‌లోని మోహినాబాద్ ఫైర్ఫాక్స్ స్పోర్ట్స్ రిసార్ట్‌లో గతనెల 28న జరిగిన 12వ రాష్ట్రస్థాయి ఇంటర్ జిల్లా టేబుల్‌టెన్నిస్ చాంపియన్ పోటీల్లో పెద్దపల్లిజిల్లా మహిళాజట్టు హైదరాబాద్‌తో తలపడగా పెద్దపల్లి జట్టు తృతీయస్థానంలో నిలిచి పతకాలు సాధించింది. విజయం సాధించిన జట్టును జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్, సుల్తానాబాద్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పల్ల సురేష్, దాసరి రమేష్, ఎస్కే ఇక్బాల్, ప్రణయ్, తిరుపతి అభినందించారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



బానోతు శృతి



లియాన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): కామారెడ్డి జిల్లాలోని జుక్కల్‌లో ఈ నెల1 నుంచి 3వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-14 రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వపాఠశాల విద్యార్థినులు సత్తాచాటి పతకాలను కైవసం చేసుకున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ అంతటి శంకరయ్య తెలిపారు. 58కేజీలలోపు విభాగంలో బానోతు శృతి అద్వితీయ ప్రతిభకనబరిచి బంగారు పతకం కైవసం చేసుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిందని తెలిపారు. అలాగే 54 కేజీలలోపు విభాగంలో రాణించిన లియాన కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముల్కూరి రాజేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆన్‌లైన్ సేవలకు ప్లాట్‌ఫాం ఉమాంగ్

● కేంద్ర ప్రభుత్వ అధికారిక యాప్‌లో అన్ని సైట్లు

● ఒకే యాప్‌లో 2 వేలకుపైగా వెబ్‌సైట్లు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఉమాంగ్ యాప్‌ను రూపొందించారు. ఆన్‌లైన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక డిజిటల్ గవర్నెన్స్ అప్లికేషన్‌గా ఉమాంగ్(యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్)ను రూపొందించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ దాదాపు 2 వేలకుపైగా వెబ్‌సైట్లు ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి. 13 ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది. మైస్కీం, డిజిలాకర్‌కు అనుసంధానంగా ఈ యాప్ పనిచేస్తుంది. ప్రభుత్వ సేవలకు వేర్వేరు వెబ్‌సైట్లు, యాప్స్‌కు అవకాశం లేకుండా, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే మొబైల్ ఫోన్‌లో సేవలను పొందవచ్చు.

● **అందుబాటులో సేవలు**

రాష్ట్రానికి సంబంధించిన మీసేవ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రాలు, మ్యారేజ్ సర్టిఫికెట్‌కు ఉమాంగ్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పింఛన్లకు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్, విద్యార్థులకు కాలేజీలు, యూనివర్సిటీలు, అప్రూవ్‌డ్ విద్యా సంస్థల వివరాలు తెలుసుకోవచ్చు. ఏఐసీటీఈ, ఎస్ఎస్‌సీ వెకెన్సీలు తెలుసు కోవచ్చు. యూజీసీకి సంబంధించిన ఈ బుక్స్, సిలబస్, పాత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు, రీసెర్చ్ వివరాలు అందు బాటులో ఉంటాయి. పరీక్ష క్యాలెండర్ వివరాలు తెలుసుకోవచ్చు. రేషన్ కార్డులు, ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్, విద్యుత్ బిల్, రైతులకు సంబంధించిన ఈనామ్ మార్కెట్ వివరాలు, పీఎం కిసాన్ యాప్ ద్వారా ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేసుకో వచ్చు. ఇవే కాకుండా స్త్రీ శిశు సంక్షేమశాఖ, యూత్ స్కిల్ ఎంపవర్‌మెంట్, వైద్య సర్వీసులు, పోలీస్, రవాణాతోపాటు అనేక శాఖల సేవలన్నీ ఉమాంగ్‌లో అందుబాటులో ఉన్నాయి.

● **కేంద్ర ప్రభుత్వ సేవలు**

ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్‌లను డిజిటల్‌గా యాప్‌లో స్టోర్ చేసుకుని షేర్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌వో సేవలను పొందవచ్చు. ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. పాస్‌పోర్టు సేవలు, పింఛన్ పత్రాలు, సర్టిఫికెట్‌ను పొందవచ్చు. 2 వేలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నీ యాప్ ద్వారా పొందవచ్చు.

● **యాప్ డౌన్‌లోడ్ ఇలా**

మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ లేదా యాప్ స్టోర్‌లోకి వెళ్లి ఉమాంగ్ అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. న్యూ యూసర్/రిజిస్టర్‌ను క్లిక్ చేసి మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఎంపిన్‌ను సెట్ చేసుకున్న తర్వాత ఆధార్ డేటాను నమోదు చేయాలి. లాగిన్ అయిన తర్వాత డాష్ బోర్డులో ఆల్ సర్వీసెస్ ద్వారా కావాల్సిన సేవను ఎంచుకోవాలి. 80 కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 1,745 ఆన్‌లైన్ సేవలు, వివిధ రాష్ట్రాల సేవలు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి.

ముగిసిన బీచ్ వాలీబాల్ పోటీలు



కేశవపట్నంలో జరిగిన పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికపోటీలను బుధవారం నిర్వహించారు. ఉమ్మడిజిల్లాలోని వివిధపాఠశాలల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సుభాష్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7నుంచి 9వరకు ఖమ్మంజిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుడు కామురోజు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ సెక్రెటరీ శ్రీను, మోడల్ స్కూల్‌పీడీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, కోశాధికారి వీరపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, నిర్మల, సాగర్, మహేష్‌హరీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సైనిక్ స్కూల్ విద్యార్థి



ఎన్ సిద్ధు

చొప్పదండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్‌పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఎన్.సిద్ధు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాన్ని సాధించాడు. ఇదే స్కూల్‌కుచెందిన వరుణ్‌తేజ కాంస్య పతకం గెలుచుకున్నాడు. విద్యార్థులను, కోచ్‌వంశీకృష్ణ, పీఈటీ సుమన్, విక్రమ్‌ను డైరెక్టర్ కర్నల్ రాజాదత్త, ప్రిన్సిపాల్ లింగయ్య, ఎస్‌వీపీ శ్రీనివాస్, ప్రమోద్‌రాజు అభినందించారు.

అంధుల పాఠశాల విద్యార్థితో కలిసి పాట పాడిన కలెక్టర్



విద్యార్థితో కలిసి పాడుతున్న కలెక్టర్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్‌లోని అంధుల పాఠశాల విద్యార్థిని సింధుశ్రీతో కలిసి కరీంనగర్ జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి పాట పాడారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులలో స్ఫూర్తి నింపేందుకు పాటను యూట్యూబ్‌లో పోస్ట్ చేశారు. సినీగేయ రచయిత చంద్రబోస్ 2009లోవిడుదల చేసిన నింగినేల నాదే.. అనే సినిమా కోసం రాసిన 'ఆరాటం ముందు ఆటంకం ఎంత' అనే పాటను విద్యార్థినితో కలిపి పాడారు. గతలో సింధుశ్రీ పాటపాడటం చూసిన కలెక్టర్ పాట పాడగా, కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజికల్ టీచర్ సరళ, స్థానిక మ్యూజిక్ డైరెక్టర్ కెబి శర్మ ఆధ్వర్యంలో పాటను రికార్డు చేశారు. గతంలోనూ జిల్లాకలెక్టర్ ఆడపిల్లను రక్షించుకుందాం అంటూ పాడిన ఓ చిన్ని పిచుక పాటకు విశేష ఆదరణ లభించింది.

సడన్ బ్రేక్ వేసిన బస్ డ్రైవర్

● 11మందికి గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బుధవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్-1 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు వేములవాడకు వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా ఓ కారు బస్సుకు అడ్డుగా వచ్చింది. దీంతో కారును తప్పించబోయి ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో సీట్లలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ముందు సీట్లకు తగిలి కింద పడిపోయారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలు కావడంతో వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బధిరుల పాఠశాలల్లో ఇంటర్ విద్య

● రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కరీంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయో వృద్ధులశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్‌సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజతోకలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఐదుశాతం కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం 50కోట్లరూపాయలు కేటాయించిందన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్‌లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామన్నారు. దివ్యదృష్టిని వృథా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వచ్చే సంవత్సరం దివ్యాంగుల దినోత్సవం నాటికి సమస్యలన్నీ పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. దివ్యాంగుల శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగుల్లో ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సైన్ లాంగ్వేజ్‌లో జనగణ మన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూపీఎస్సీ వంటి ఉన్నతఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. దివ్యాంగుల కో-ఆపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టిందన్నారు. 40శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డీసీటీసీ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, అధికారులు,వికలాంగుల సంక్షేమసంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



వేడుకలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వేడుకలో నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

● **బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం..**

హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అతడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులశాఖ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. బాలుడి చదువు బాధ్యతలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

● బోనాలు సమర్పించిన భక్తులు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జున స్వామి జాతరకు బుధవారం భారీ సంఖ్యలో భక్తులువచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లోగర్భగుడిలోకి తరలివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తమ చిన్నారులకు పుట్టువెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు నిలువెత్తు బంగారం(బెల్లం) తులాభారంవేసి భక్తులకు పంచిపెట్టారు. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు కొండూరి రాజేందర్ శర్మ, కొండూరి రఘునందన్ శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 20 వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.79,510 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ట్రైనీకలెక్టర్ కన్నంహరిణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి, శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్ రెడ్డి, గీతా, టౌన్ ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

భీమన్న సన్నిధి వైపు వాహనాలకు బ్రేక్

● రెండు వైపులా రహదారి బంద్



ఉత్తరం వైపు బారికేడ్లతో మూసివేసిన రహదారి

వేములవాడ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముందుగా వేములవాడకు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వేములవాడకు భక్తుల రాక రోజురోజుకు పెరుగుతోంది. దీంతోభక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భీమేశ్వరాలయం వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం భక్తులు వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేశారు. రహదారిని పూర్తిగా బారికేడ్లు పెట్టి మూసివేశారు. ప్రధానంగా నటరాజ్ విగ్రహం ఉత్తరం వైపు, పార్వతీపురం అన్నదాన సత్రం వైపు బారికేడ్లు పెట్టి రహదారులు మూసివేశారు. దీంతో స్థానికుల వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు పార్కింగ్ స్థలం వద్ద భారీ గేట్ ఏర్పరిచి కేవలం వీఐపీ వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు చేరుకోవాలంటే వాహనాలు పార్కింగ్‌లో పెట్టి కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధంగా దేవాలయానికి దక్షిణం వైపు విస్తరణ పేరిట ఇరువైపులా రహదారులు మూసివేశారు. దీంతో భక్తుల వాహనాలు, స్థానికుల వాహనాలు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా వేములవాడ పట్టణంలో పలుచోట్ల దేవాలయాలకు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ప్రారంభమైన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

తంగళ్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు ప్రారంభ మయ్యాయి. బుధవారం జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు శ్రీమాన్ నమిలకొండ రమణాచారిస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పూజాకార్యక్రమలు జరిగాయి. సాయంత్రం ఎదురుకోళ్ల ఉత్సవం వైభంగాసాగింది. కార్యక్రమంలో చినజీయర్‌స్వామి శిష్యబృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంత కౌశిక్, వివేక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభం

బోయినపలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామ సమీపంలోని గుట్టపై దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. బుధవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు బోట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై రమాకాంత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

రామగిరి మండలం సర్పంచ్ బరిలో 65 మంది


చందనాపూర్ సర్పంచ్ మంజుల

రామగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామపంచాయతీలకు ఎన్నికల్లో భాగంగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. చందనాపూర్ సర్పంచ్‌గా కొండ మంజుల ఏకగ్రీవమయ్యారు. మండలంలో 158 వార్డు సభ్యుల స్థానాలకుగాను 24 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగ 134 మందికి గాను 371 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆదివారంపేట్ 6వ, వార్డు, బేగం పేట్ 04, 05,12, చందనాపూర్ 01, జల్లారం 09, 10, కల్వచర్ల 12, లొంకకేసారం 01,03, పన్నూరు 08,09, పెద్దంపేట్ 02,03,04,05,06, 07,08,09, రాజాపూర్ 01,06, రత్నాపూర్04, ఏకగ్రీవం అయ్యాయి. చందనాపూర్ ఏకగ్రీవం కావడంతో 15 గ్రామపంచాయతీలో 65 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

కమాన్‌పూర్‌లో...

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 9 గ్రామపంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్ పదవులకు బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 45 మంది అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉన్నారు. 92 వార్డులకు గాను 220 మంది వార్డు సభ్యులు ఉన్నారు.

కూనారంలో కుదరని సయోధ్య

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూనారం సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామ పెద్దలు సమావేశం నిర్వహించారు. బుధవారం హనుమాన్ దేవాలయం వద్ద సమావేశం నిర్వహించగా, సర్పంచ్‌గా బరిలో ఉన్న అభ్యర్థులు ఒప్పుకోకపోవడంతో పోటీ అనివార్యమైంది. ఈ గ్రామంలో ఎస్సీ జనరల్ కావడంతో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. కాగా అన్ని పార్టీల నాయకులు ఏకగ్రీవంగా కోసం కృషి చేశారు. ఈ సందర్భంగా పలువురు వారి అభిప్రాయాలు తెలపడంతో పోటీ తప్పలేదు.

ఇక ప్రచార హోరు...

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం రాత్రి మంథనిలో మకాం వేసి పలు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్ అభ్యర్థులతో మంతనాలు జరిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరే సర్పంచ్ బరిలో ఉండేలా సహకరించాలని సూచించారు.

● 11న పోలింగ్

మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో ఈనెల 11వ తేదీన తొలి విడత ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. మంథని మండలంలోని 35 పంచాయతీలు, 282 వార్డు స్థానాలు, కమాన్‌పూర్ మండలంలోని 9 పంచాయతీలు 92 వార్డుస్థానాలు, ముత్తారం మండలంలోని 15 పంచాయతీలు, 138 వార్డు స్థానాలు, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని 24 పంచా యతీలు, 226 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

● అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు..

మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు అక్షరమాలను బట్టి రిటర్నింగ్ అధికారులు గుర్తులు కేటాయించారు. రేపటి నుంచి అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

● మూడో విడత నామినేషన్లు షురూ..

గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ఆరంభమయ్యింది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఎలిగేడు, ఓదెల మండలాల్లోని 91 పంచాయతీలు, 852 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

● ఎలిగేడు మండలంలోని 12 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 9 నామినేషన్లు, 114 వార్డు స్థానాలకు 46 నామినేషన్లు దాఖలయ్యాయి.

● సుల్తానాబాద్ మండలంలోని 27 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 31 నామినేషన్లు, 246 వార్డు స్థానాలకు 84 నామినేషన్లు వచ్చాయి.

● ఓదెల మండలంలోని 22 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 23 నామినేషన్లు, 198 వార్డులకు 57 నామినేషన్లు వచ్చాయి.

● పెద్దపల్లి మండలంలోని 30 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు 41 నామినేషన్లు, 294 వార్డు స్థానాలకు 155 నామినేషన్‌లు దాఖలయ్యాయి.

ఎలిగేడులో 55 నామినేషన్లు

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల పరిధిలో సర్పంచ్, వార్డు స్థానాలకు 55 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు. ఎలిగేడు క్లస్టర్ పరిధిలో 2 సర్పంచ్, 7 వార్డు స్థానాలు, ధూళికట్ట పరిధిలో సర్పంచ్ 2, వార్డు సభ్యులకు 21, నర్సాపూర్ పరిధిలో సర్పంచ్‌లు 3, వార్డు స్థానాలు 8, సుల్తాన్‌పూర్ క్లస్టర్ పరిధిలోని సర్పంచ్‌లకు 2, వార్డు స్థానాలకు 10 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే తహసీల్దార్ యాకయ్య నామినేషన్ల కేంద్రాలను పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

పెద్దపల్లి మండలంలో...

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల మూడో విడత ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ 12 నామినేషన్ కేంద్రాల్లో కొనసాగింది. మండలంలోని 30 పంచాయతీలకు గాను 41 మంది అభ్యర్థులు, 294 వార్డు స్థానాలకు 155 అభ్యర్థుల నుండి నామినేష న్‌లు దాఖలు అయినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.


ఎలిగేడులో నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్

సుల్తానాబాద్‌లో...

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు 34 నామినేషన్లు దాఖలయ్యాయి, వార్డు సభ్యులకు 84 మంది దాఖలు చేశారు. అల్లీపూర్, భూపతిపూర్, చిన్నబొంకూరు, గట్టేపల్లి, కదంబాపూర్, గొల్లపల్లి, మియాపూర్, నారాయణరావుపల్లి, నర్సయ్యపల్లి, తొగర్రాయి గ్రామాల నుంచి ఒక్కోక్క నామినేషన్ దాఖలైంది. అలాగే దేవునిపల్లి, దుబ్బపల్లి, ఐతరాజుపల్లి, కాట్నపల్లి గ్రామాలకు సంబంధించి రెండు చొప్పున వచ్చాయి. సుద్దాలలో మూడు, రేగడిమద్దికుంటలో నాలుగు, నీరుకుళ్లలో ఆరు నామినేషన్లు వచ్చాయని ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు తెలిపారు.


ఏకగ్రీవమైన నాగారం సర్పంచ్ శ్రీదేవి, తోటగోపయ్యపల్లి సర్పంచ్ రమేష్, మైదుపల్లి సర్పంచ్ లక్ష్మణ్

ముగిసిన నామినేషన్ల పరిశీలన

పాలకుర్తి/అంతర్గాం, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పాలకుర్తి,అంతర్గాం మండలాల్లో బుధవారం సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలన ముగిసింది. ఈ నెల 6న ఉపసంహరణ అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. అంతర్గాం మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు నిర్వహించిన నామినేషన్లలో సర్పంచ్ అభ్యర్థులుగా 80, 132 వార్డులకు 305 మంది నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. పాలకుర్తి మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లుగా 88, 156 వార్డులకు గాను 414 నామినేషన్లు రాగా, 14 వార్డుల్లో మాత్రం ఒక్కోక్కరుగా నామినేషన్లు వేశారని, బసంత్‌నగర్‌లో 12 వార్డు నామినేషన్ పరిశీలనలో కొట్టుడు పోయినట్లు అధికారులు తెలిపారు.

ఆసక్తిగా మారిన అత్త కోడళ్ల నామినేషన్లు

జీడినగర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా అత్తకోడళ్ల నామినేషన్లు వేశారు. జీడినగర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా అత్త సూర నర్సమ్మ సోమవారం నామినేషన్ వేశారు. నర్సమ్మ పెద్ద కోడలు సూర రమక్క సైతం సర్పంచ్‌గా మంగళవారం నామినేషన్ వేయడం చర్చకు దారి తీసింది.

నేడు ఎమ్మెల్యేకు ఆత్మీయ సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేయనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ తెలిపారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్ళ కాలంలో ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. పారిశ్రామికంగా, మెడికల్ హబ్‌గా, ఆధ్యాత్మిక కేంద్రంగా నియోజకవర్గం నిలవనున్నట్టు తెలిపారు. గురువారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే ఆత్మీయ సన్మానానికి ప్రజలు తరలిరావాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, నాయకులు సాగంటి శంకర్, చక్రపాణి, మార్కరాజు, తిరుపతిరెడ్డి, అనుము రాములు, రాజేశం, దశరథం, ఓదేలు, అవినాష్ ప్రశాంత్, సంపత్, మేకల అజయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నల్గొండలో ఈనెల 3 నుండి 5 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య తెలిపారు. గత నెల 23న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ కబడ్డీ పోటీలు నిర్వహించగా పోటీల్లో శ్రీజ, అవంతిక, శేరిష్మా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు వారిని అభినందించారు.

అభివృద్ధి చూడలేకనే ఎమ్మెల్యేపై ఆరోపణలు


విలేరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రామగుండంలో వందల కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులను చూడలేకనే మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకుడు కౌశిక హరి ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో స్థానంలో ఎమ్మెల్యే 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను తీసుకువస్తే తాము 13సంవత్సరాల క్రితమే 1320మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్‌ను తీసుకువచ్చామంటూ వారు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రామగుండంకు 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే తీసుకు వస్తే జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రామగుండంలో గడిచిన ఐదేళ్లలో కమీషన్ల పాలన ఎవరు కొనసాగించారో ప్రజలకు తెలుసునని, బూడిద, ఇసుక, మట్టి, ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల్లో కోట్ల రూపాయలు దండుకున్నారని, ప్రభుత్వాసుపత్రిలో ఒక్కొక్కరికి రూ.3లక్షలు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రూ.15లక్షలు, మున్సిపాలిటీలో రూ.4లక్షలు వసూలు చేసింది మాజీ ఎమ్మెల్యే కాదా అని వారు ప్రశ్నించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట ముగ్గురి చావుకు కారణమైన బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలే తరిమికొడతారన్నారు. రామగుండం అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తీసుకువచ్చారని, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, ముస్తఫా, గట్ల రమేష్, మిడిదొడ్డి ప్రవీణ్, వసంత్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలని 2కే రన్


2కే రన్‌ను ప్రారంభిస్తున్న తుమ్మల రాజిరెడ్డి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖిలో 2కే రన్ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామితో కలిసి రాజిరెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు ఈనెల 7నుండి 9వ తేదీ వరకు మెదక్ జిల్లా కేంద్రంలో జరుగనున్నాయని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను యాజమాన్యం చేతుల్లో బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి ముత్యం రావు, మెండె శ్రీనివాస్, ఏం రామాచారి, ఆరెపల్లి రాజమౌళి, మామిడాల శ్రీహరి, గుత్తికొండ గోపాల్, నంది నారాయణ, జంగపల్లి మల్లేష్, ఉల్లి మొగిలి, నెర్వట్ల నర్సయ్య, సానం రవి పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ యజమానులు లైసెన్స్ పొందాలి

కోల్‌సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకర్ వాహనాల యజమానులు నగరపాలక సంస్థ నుంచి లైసెన్స్‌లు పొందాలని కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి మల వ్యర్థాలను సేకరించడం, రవాణా, రీసైక్లింగ్‌పై కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధిశాఖ ప్రకారం లైసెన్స్ జారీ చేస్తుందన్నారు. నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ వాహనం ద్వారా సేకరించిన మల వ్యర్థాలను డీస్లడ్జింగ్ ఆపరేటర్లు ఎక్కడా పారవేయకుండా మల్కాపూర్ శివారులో ఉన్న ఎఫ్ఎస్‌టీపీకి మాత్రమే తరలించాలన్నారు. సేవలకు ప్రజలు 14420ను సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ విశాఖపట్నంలో గత నెల 27న జరిగిన 28వ ఒకినావా మార్షల్ ఆర్ట్స్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో మండల కేంద్రంలోని వేదవ్యాస హైస్కూల్ విద్యార్థులు కటా, స్పారింగ్ విభాగాల్లో 17 మంది పాల్గొన్నారు. అండర్ 9లో జరిగిన బాలికల విభాగంలో వినూత్న గోల్డ్ మెడల్, రిత్విక, ధనస్విని, సాత్వికలు సిల్వర్, అనీహశ్రీ, శివాన్విత, మౌనివికలు బ్రౌంజ్ మెడళ్లు సాధించారు. అలాగే బాలుర అండర్ 9 విభాగం స్పారింగ్‌లో మోక్షిత్ గోల్డ్, హిమాన్షు సిల్వర్, అశుతోష్ రామ్, రియాన్స్ అఖిల్ ప్రీతం, హన్షిత్‌లు బ్రౌంజ్ మెడల్ సాధించారు. అండర్ 17 స్పారింగ్ విభాగంలో నిహారిక గోల్డ్, శరణ్య సిల్వర్, అండర్ 19లో చందన సిల్వర్, అండర్ 14లో చరణ్ తేజ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. బుధవారం కలెక్టర్ కోయశ్రీహర్షను వారు కలిశారు. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, డైరెక్టర్ గుర్రం దివాకర్, జూపాక సౌమ్య, ప్రిన్సిపాల్ సదయ్య, గ్రాండ్ మాస్టర్ మొండయ్య, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ సంపత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులను చులకనగా చూడవద్దు

ఖని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగుల పట్ల సమాజం చులకనగా చూడవద్దని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అన్నారు. అంతర్జాతీయ ఏయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏఆర్‌టీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోగులు ప్రతి నెల రక్త పరీక్షలు చేయించుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైరస్ పూర్తిగా అంతం కాకపోయినప్పటికీ మనో ధైర్యంతో ఆరోగ్యంగా జీవించాలని, ఏయిడ్స్ రోగులకు ప్రభుత్వం పెన్షన్ కూడా అందిస్తుందని చెప్పారు. హెచ్‌ఐవీ అంటే చావు అని అపోహలకు పోకుండా కౌన్సిలింగ్ తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ కృపాబాయి, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, నీలిమ, శ్రీనివాస్, కౌన్సిలర్ కట్కూరి శంకర్ పాల్గొన్నారు.

సీఎంపై ఫిర్యాదు

ముత్తారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ జిల్లా కార్యదర్శి బిరుదు గట్టయ్య ముత్తారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, హిందువులను అవమానపరిచే విధంగా దేవతలపై వ్యాఖ్యలు చేశారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసినందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బేగంపేట్ పాఠశాలలో ల్యాబ్ ప్రారంభం

రామగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో డీఈవో శారద బుధవారం ల్యాబ్‌ను ప్రారంభించారు. శ్రీసీతారామ సేవాసదన్ మంథని ఆర్థిక సహకారంతో సైన్‌అండ్‌మాథ్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఏఎంవో షైక్, ఎంఈవో కొంరయ్య ఏపీపీసి చైర్ పర్సన్ చంద్రకళ, సేవాసదన్ అధ్యక్షుడు హరిబాబు, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల గణపతి, కోశాధికారి అంబరీష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సామాజిక కార్యకర్త రఘోత్తంరెడ్డి, హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు రాంకిషన్‌రావు, పద్మజ, గీతారాణి, స్వరూప, మంగ, శ్రీదేవి, పీఈటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంకల్పం ముందు అంగవైకల్యం అడ్డురాదు

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



ఖనిలో దివ్యాంగుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, కాల్వశ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో

సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతోపాటు వారికి అవసరమైన ఉపకరణాలు అందిస్తుందని మండల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రత్నాకర్‌రెడ్డి, దివాకర్ అన్నారు. వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతు దివ్యాంగులకు ఫిజియోథెరపీ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని ఫిజియోథెరపిస్టు గౌసియా ఖాతూన్‌సాబాను తెలిపారు. ఐఆర్పీ సత్తయ్య, కరుణశ్రీ, సీఆర్పీలు సదానందం, రామచంద్ర, కిరణ్ కుమార్, మంజుల, ఎంఐఎస్ ప్రియాంక, రజియా భేగం పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): సంకల్పం ముందు అంగవైకల్యం అడ్డురాదని పలువురు దివ్యాంగులు నిరూపించారని తహసీల్దార్ డి. శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మా ట్లాడారు. దివ్యాంగులు మానసికంగా కృంగిపోకుండా ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శీల, హెచ్‌ఎం మల్లారెడ్డి, ఫిజియోథెరపి డాక్టర్ దిలీప్, పీఈటి మమత, టీచర్ శ్రీనివాస్, ఐఆర్పీ రమ్య, ఎంఐఎస్ సునిత, సిసిఓ సురేష్, సీఆర్పీలు కవిత, శ్రీలత, ప్రేమ్‌సాగర్, కుమారస్వామి, మెసెంజర్ రాజు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. గంగయ్య, రాచమల్ల సత్యం, రమేష్, అంజయ్య, చేపూరి శేఖర్, జక్కుల సంతోష్, రాజేశం, పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జీఎం కాలనీ గోదావరి కళా ప్రాంగణంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్‌జీ-1 ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆటల పోటీల ద్వారా వారిలో ఆత్మస్థైర్యం ఏర్పడుతుందని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. మనోచైతన్య నిర్వాహకులు డీ కృష్ణ కుమార్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, అధికారుల సంఘం ప్రతినిధి శ్రావణ్‌కుమార్, డీవైపీఎం వేణు, హన్మంత రావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని భవిత కేంద్రంలో నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆట పోటీలు, పోషకులకు వివిధ రకాల డిజేబులిటీస్ గురించి అవగాహన కల్పించారు. ఆట పోటీల విజేతలకు ఎంఈవో లక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. ఫిజియోథెరపిస్టు శంకర్, బోధకులు శ్రీనివాస్, సురేష్, సౌజన్యపాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఐఈఆర్పీ సుమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీఓ సిరిమల్ల మహేష్ మాట్లాడుతూ పిల్లల మనసును తెలుసుకొని వారికి అనుకూలంగా వ్యవహరిస్తే వారి ఆలోచనలో మార్పు వస్తుందన్నారు. అనంతరం దివ్యాంగ పిల్లలకు వివిధ క్రీడలు నిర్వహించి, అతిథుల చేత బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు సునీత, అత్తె రాజారాం, స్వప్న, హెల్త్ సూపర్ వైజర్ సరోజన, తల్లితండ్రులు, సీఆర్పీలు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ప్యానెల్ బృందం


ప్యానల్ బృందంతో మోడల్ స్కూల్ సిబ్బంది

సుల్తానాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి మోడల్ స్కూల్‌ను బుధవారం ప్యానెల్ ఇన్స్‌పెక్షన్ బృందం సందర్శించారు. గంగాధర మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ ఆధ్వర్యంలో గల బృందం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల బోధనల తీరు, వారి లెసన్ ప్రణాళికలను, బేస్ లైన్ టెస్టు, ఎస్ఏ ఒకటి పరీక్ష పేపర్స్‌లను పరిశీలించారు. ఫిజిక్స్ బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. వారితో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బల్బీర్ కౌర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

ఎలిగేడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన మండల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం ఎలిగేడు గ్రామంలోని గ్రామస్థులు, మిత్రులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన సంఘంలోని బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాగినేడు ఆలయంలో ఘనంగా పారాయణం

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాగినేడు స్వయంభూ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పెద్దపల్లికి చెందిన సనాతన ధర్మ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో మహిళలు, భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో సుమారు వందమందికి పైగా మహిళలు పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భజనలు, కీర్తనలను ఆలపించారు. పురోహితులు రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ చైర్మన్ భూమయ్య తోపాటు కోలేటి శ్రీనివాస్ సారథ్యంలో నిర్వహించారు. పుష్పలత, రేణుక, స్రవంతి, అర్చన, ధనలక్ష్మి, జ్యోష్ణ , బజ్జూరి రాధిక పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కాల్వశ్రీరాంపూర్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. బుధవారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు సరైన పత్రాలు దగ్గర ఉంచుకొని ప్రయాణించాలన్నారు.

బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుచేయాలి

పెద్దపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రామగుండం, పెద్దపల్లి, మంథని ప్రాంతానికి బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు అత్యవసరమని టీపీసీసీ నాయకులు పెర్క శ్యాం అన్నారు. శ్యాం మాట్లాడుతూ ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కాళేశ్వరం, ఫర్టిలైజర్ యూనిట్లు, ఆయిల్ గ్యాస్ పైప్ లైన్‌లు, పవర్ ప్లాంట్లు ఉండటంతో పరిశ్రమలు విస్తరిస్తున్నాయన్నారు. పరిశ్రమలకు పెట్టుబడులకు, ఉపాధికి ఎయిర్ కనెక్టివిటి అవసరమన్నారు. బసంత్‌నగర్ ప్రాంతం ఎయిర్‌పోర్టుకు అనుకూలమని కేంద్ర విమానయన శాఖ తెలిపినా రామారావుపల్లి గుట్ట రన్‌వే మార్గానికి అడ్డుగా ఉందని పేర్కొన్నారు. గుట్ట తొలగింపు వల్ల ప్రభుత్వానికి లాభం చేకూరుతుందన్నారు. ఎయిర్ పోర్టు రావడం వల్ల పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి మార్గం దొరుకుతుందన్నారు. బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఖనిలో జర్నలిస్టుల నిరసన


చౌరస్తాలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మార్కండేయకాలనీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్న జర్నలిస్టులను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం గోదావరిఖని చౌరస్తాలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజేయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్, నాయకులు పూదరి కుమార్, దయానంద్‌గాంధీ, డీ మాధవరావు మాట్లాడుతూ పదేళ్లుగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం దాటవేత ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కూడా జర్నలిస్టులకు అన్యాయం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా మభ్య పెడుతోందన్నారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ ఎస్ఐ అనూష సూచించారు. బుధవారం బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లలో వచ్చే అనవసరమైన సందేశాలను ఓపెన్ చేయడం ద్వారా వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుందని, నేరగాళ్ల చేతిలో పడి బ్యాంకుల్లో డబ్బులు ఖాళీ చేస్తే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. శంకర్, సంతోషిని, కానిస్టేబుళ్లు మహేష్, వెంకటకృష్ణ, నగేష్, ప్రవళిక పాల్గొన్నారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో సైబర్ నేరాలపై నిర్వహించిన కార్యక్రమానికి వన్‌టౌన్ ఎస్ఐ రమేష్ హాజరయ్యారు. సైబర్ నేరాల నివారణకు ఉపయోగపడే సాంకేతిక పద్ధతులు, ఏఐ వినియోగం గురించి, ఆన్‌లైన్ ఫ్రాడ్స్, ఫైనాన్షియల్ ఫ్రాడ్‌లు జరుగుతున్నాయని, దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వన్‌టౌన్ ఎస్ఐ అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి విగ్రహాన్ని నెలకొల్పాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డులో తెలంగాణ అమరుడు కాసోజుడు శ్రీకాంత చారి వర్ధంతి నిర్వహించారు. ఆకుల స్వామి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ అమరవీరుడు శ్రీకాంత్ చారి విగ్రహాన్ని ట్యాంక్ బండ్ మీద ప్రతిష్ఠించాలని, రాష్ట్రంలో పోరాట యోధులకు ఇచ్చే అవార్డులకు శ్రీకాంత్ చారి పేరు పెట్టాలని కోరారు. శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోమటిపల్లి రాజేందర్, తమ్ముడుబోయిన రాజ్‌కుమార్ యాదవ్, వెన్నం రవీందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అసువులు బాసిన కాసోజు శ్రీకాంత్ చారి వర్ధంతిని మండల సర్ణకార సంఘం నిర్వహించింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ప్రాణాలర్పించి తెలంగాణ ఉద్యమ కాగడగా శ్రీకాంత్ చారి పేరుపొందారని అన్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి క్యాండిల్స్‌తో నివాళులర్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక

ముత్తారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓడేడు గ్రామ మాజీ ఎంపిటిసి శీలం తిరుపతి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ చేరారు. బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనతోపాటు దాసరి పవన్ గౌడ్ తదితరులు చేరారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు, సీనియర్ నాయకులు కోటగిరి శ్రీనివాస్, తీగల సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.